క్లుప్తంగా

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



పి.విజయదుర్గ

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ తెలిపారు. అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రాజీచేసుకోదగ్గ సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చర్యలు

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. పట్టణంలో వివిధ వార్డుల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పారు. వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యం విషజ్వరాలు ప్రబలకుండా, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజూ డ్రైయిన్లు శుభ్రం చేయాలని, మురుగునిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, కిషోర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శ



పెనుగొండలో నానాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కారుమూరి

పెనుగొండ: కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) మృతికి ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం పెనుగొండలోని నానాజీ నివాసంలో నానాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జవ్వాది కుటుంబీకులు ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన



పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

నరసాపురం: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నరసాపురం హెడ్ పోస్టాఫీస్ వద్ద తపాలా ఉద్యోగులు ఆందోళన చేశారు. అఖిల భారత తపాలా ఉద్యోగులు సంఘం నరసాపురంశాఖ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగులకు ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు ఆపాలని, 8వ వేతన కమిటీ, జీడీఎస్ ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, 7వ వేతన కమిటీలో అమలు కాని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు జి.శ్రీరామనాగరాజు, బి.సాంబ శివరావు, ఎన్.నాగరాజు, ఎన్.జయప్రకాష్, జి.శివశంకర్, ఆర్.మురళీ నాయక్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని టౌన్ హాస్పటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ నారిన శ్రీహర్ష తెలిపారు. నరాలు, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. స్థానిక పెనుమదం రోడ్డులో ఉన్న టౌన్ ఆస్పత్రిలో నందు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చామకూరిపాలెంలో పొలం పిలుస్తోంది

నరసాపురం రూరల్: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటించి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అన్నారు. బుధవారం చామకూరిపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరిలో సస్య రక్షణ, యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎక్కువగా పురుగు మందులు వాడటం వల్ల మేలు చేసే మిత్ర పురుగులు చనిపోయి పంటకు హాని కలిగే శత్రు పురుగులు బెడద పెరుగుతుందన్నారు. రైతులు పురుగులు, తెగుళ్లను బట్టి మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వీఏఏ సాయిదుర్గ, వీహెచ్ఏ చందుకుమార్ పాల్గొన్నారు.

పర్యాటక తీరం..అభివృద్ధికి దూరం

- జీచ్‌లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కార్తీక మాసం వస్తున్నా కానరాని ఏర్పాట్లు



పేరుపాలెం బీచ్ (ఫైల్)



కేపీ పాలెం బీచ్‌లో నిర్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం



పేరుపాలెంలో 54 అడుగుల ఆంజనేయుని విగ్రహం

మొగల్తూరు: గత ప్రభుత్వంలో జిల్లాలోనే ఏకైక బీచ్‌లైన పేరుపాలెం, కెపిపాలెం బీచ్‌లు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా పర్యాటక ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. మరో పది రోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో ప్రతివారం లక్షలాది సందర్శకులు బీచ్‌కు తరలి వస్తారు. పర్యాటకుల రాకను నేపథ్యంలో ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లను బీచ్‌ల్లో చేపట్టలేదు. కనీసం నిధులు కూడా మంజూరు కాని పరిస్థితి. నియోజకవర్గంలో సుమారు 19 కిలోమీటర్ల సముద్ర తీరమున్నా ముఖ్యంగా మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు అనువుగా ఉన్నాయి. ప్రతి ఏటా కార్తీకమాసంలో లక్షలాది వంది పర్యాటకులు బీచ్‌లను సందర్శిస్తారు. తీరం పొడవునా కొబ్బరి తోటలుండటం ఈ బీచ్ ప్రత్యేకత. కేరళలోని కోవలం బీచ్ తరువాత ఇక్కడే ఇలా కొబ్బరి చెట్లు ఉంటాయి. బీచ్‌ను సందర్శించే సందర్శకులు కొబ్బరి తోటల్లో సేదతీరుతూ ఉంటారు.

బీచ్‌లో ఫైవ్‌స్టార్ హోటల్, రిసార్ట్స్

కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను కలిపి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌గా 2020 ఫిబ్రవరిలో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌లో నామకరణం చేశారు. ఈ బీచ్‌ల్లో ఇప్పటికే టూరిజం శాఖ ఆధ్వర్యంలో రిసార్ట్స్ నిర్మించారు. అయితే బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఫైవ్‌స్టార్ హోటల్, రిసార్ట్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపడడంతో ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ప్రభుత్వం కూడా బీచ్‌ల అభివృద్ధికి నిర్ణయించడంతో పాటు బీచ్ ఫెస్టివల్‌కు అనుమతిలిచ్చి నిధులు మంజూరు చేసింది.దీంతో పేరుపాలెం బీచ్ నుంచి కెపిపాలెం బీచ్ వరకు ఉన్న 3.5 కిలోమీటర్ల రహదారిని డబుల్ రోడ్‌గా, రూ.కోటితో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని నిర్మించారు.

గతంలో బ్లూఫాగ్ బృందం పర్యటన

2020 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నియమించిన బ్లూఫాగ్ బృందం తీరంలో పర్యటించింది. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు బీచ్‌లు అనుకూలంగా ఉన్నాయని బృందం సభ్యులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే బ్లూఫాగ్ బీచ్‌గా గుర్తించి ఏడాదికి రూ.కోటిలు బీచ్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం బీచ్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే రుషికొండ బీచ్ తర్వాత ఈ బీచ్‌లే అభివృద్ధి చెందుతాయని భావించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీచ్‌ల అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

మొగల్తూరు: ప్రజల సమస్యలు ఏ శాఖకు వచ్చినా సంబంధిత అధికారితో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని, ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, ఎస్సై జి.వాసు, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఏఓ అబ్దుల్ రహీమ్, సీడీపీఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలుకులూరి అర్జునరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పోస్ట్‌కార్డ్‌ల ద్వారా ఉచిత బస్ పథకాన్ని అమలు చేయాలంటూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, యలమర్తి మోహనరావు, మడగల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది వినతి



జిల్లా సమన్వయాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది

పాలకొల్లు అర్బన్: ఎన్టీఆర్ వైద్య సేవలో 17 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న సిబ్బంది సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా సమన్వయాధికారిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ స్కీంలో విలీనం చేయాలని ప్రభుత్వం యోచనలో ఉందని, అయితే ఈ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ లో వివిధ కేడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యం అయోమయంగా ఉందన్నారు. ప్రభుత్వం వీరికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 29 సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 25న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామని, 26న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ కోశాధికారి రామమోహన్, టీం లీడర్ రాంబాబు, రాజేంద్ర, గంగరాజు, శివశంకర్, నాగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న లంక భూములు



సక్కా వారి పాలెం వద్ద కుంగుతున్న లంక భూమి



సిద్ధాంతంలో గోదావరిలో కలిసిపోతున్న లంక భూమి

పెనుగొండ: గోదావరి నీటి మట్టం గణనీయంగా తగ్గడంతో లంకభూములు కుంగుతున్నాయి. ఏటి గట్టు పొడవునా లంకభూములు ఏటిగట్టుకు అండగా నిలుస్తుంటాయి. అయితే, నీటి ప్రవాహ ఉధృతికి నెమ్మదిగా ఏటిగట్టు పొడవునా ఉన్న లంకభూములు నెమ్మదిగా నీటి పాలవుతున్నాయి. పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి చినమల్లం వరకూ, ఆచంట మండలం పెదమల్లం నుంచి కరుగోరు మిల్లి వర కూ లంక భూములు ఏటిగట్టు పటిష్ఠంగా ఉండడానికి అండగా నిలుస్తుంటాయి. ప్రతి ఏటా వరద నీరు ఉధృతి తగ్గిన అనంతరం లంకభూములు తరగుతూ ఏటిగట్టు బలహీన పరస్తున్నాయి. ముఖ్యంగా దొంగరావిపాలెం దిగువలో సిద్ధాంతం వశిష్టా బ్రిడ్జికి సమీపంలో ఏళ్ల తరబడి లంక భూమి గోదావరి పాలవుతూ వస్తుంది. సిద్ధాంతం కేదారీఘాట్ సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద లంకభూమి నెమ్మదిగా కుంగుతుంది. దీంతో లంకభూముల్లోని కొబ్బరి చెట్లు, ఇతర వాణిజ్య పంటలు గోదావరి పాలవుతున్నాయి. ప్రతి ఏటా వచ్చే వరద గట్టును తాకుతూ ప్రవహిస్తూ ఒకే సారి తగ్గుతుండడంతో లంకభూములు కుంగడానికి కారణమవుతున్నాయి. దీనికి తోడు దొంగరావిపాలెం వద్ద గోదావరి నీటి ప్రవాహం నేరుగా ఏటిగట్టును తాకుతుండడంతో నీటిని మళ్లించడానికి గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. దీంతో దొంగరావిపాలెంలో కొంత మేర లంకభూములు పటిష్ఠంగానే ఉంటున్నాయి. దిగువ ప్రాంతంలో దీనికి భిన్నంగా లంక భూములు వేగంగా గోదావరి పాలవుతున్నాయి. దీనికి తోడు సిద్ధాంతం, నడిపూడిల్లో ఇసుక ర్యాంపులు ఉండడంతో అంచనాలకు మించి లోతుగా తవ్వకాలు చేస్తుండడం సైతం లంక భూములు కుంగడానికి కారణమని పలువురు భావిస్తున్నారు. లంకభూములు కుంగడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా కొన్ని కొబ్బరి చెట్లు, ఇతర పంటలు కోల్పోవాల్సి వస్తుందని, దీంతో పాటు విస్తీర్ణం తగ్గిపోతుందని వివరించారు. ఏటిగట్టు సమీపంలో తవ్వకాలు జరపకుండా కొంతమేర మాత్రమే ఇసుక వ్వకాలు జరిపితే లంకభూములు కుంగకుండా ఉంటాయని వారు తెలిపారు. దీనికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



వైద్య సేవలుపై ఆరాతీస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుగొండ: ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పెనుగొండలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలను పరిశీలించి, రోగుల వార్డులను, ల్యాబ్, ఎక్స్‌రే యూనిట్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, మందుల లభ్యతను పరిశీలించారు. రోగులతో మమేకమై వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. గర్భిణులు, ప్రసవాల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ జి.అనితకుమారి, వైద్యాధికారి డాక్టర్ చంద్ర సవేరి ఆమె వెంట ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



యలమంచిలి: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్



పెనుగొండ: ఇలపర్రులో మాట్లాడుతున్న తహసీల్దార్ అనితకుమారి

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాలలో రైతులంతా తమ భూములపై ఎటువంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులకు వచ్చి వాటిని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ గ్రంథి పవన్‌కుమార్ కోరారు. చించినాడ గ్రామంలో భూమి సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు బుధవారం స్థానిక సచివాలయం వద్ద రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎం 331లో సబ్ డివిజన్ కోసం 12 మంది రైతులు దరఖాస్తులు చేశారు. దీనిపై తహసీల్దార్ పవన్‌కుమార్ స్పందిస్తూ జాయింట్ ఎల్‌పీఎంపై మిగిలిన రైతులకు కూడా అవగాహన కల్పించి వారితో కూడా దరఖాస్తు చేయించాలని గ్రామ సర్వేయర్‌ను ఆదేశించారు. రైతులు ఎవరికైనా విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నా, జాయింట్ ఎల్‌పీఎం డివిజన్ చేయవలసిన ఉన్నా అందరు తప్పకుండా తహసిల్దార్ కార్యాలయంలో ఈనెల 30లోపు దరఖాస్తు చేయాలని కోరారు. గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ కోసం 12 దరఖాస్తులు, మ్యూటేషన్ కోసం 8 దరఖాస్తులు, భూమి విస్తీర్ణం సవరణ కోసం 10, కొరిలేషన్ కోసం 2 మొత్తం 32 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నింటిపై విచారణ జరిపి తదుపరి చర్య తీసుకుంటామని తహసీల్దార్ గ్రంథి పవన్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఉప సర్పంచ్ రుద్రరాజు బలరామకృష్ణ సూర్యనారాయణరాజు (చిన్న), ఎంపీటీసీ నల్లి సంధ్యారాణి, మండల ప్రత్యేక అధికారి పి వెంకటేశ్వరరావు, ఆర్ఐ యశోద, వీఆర్వో అంపవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలతో సమన్వయం చేసి పరిష్కరించనున్నట్లు తహసీల్దారు జి.అనిత కుమారి అన్నారు. రీ–సర్వేకు సంబంధించి పెనుగొండ మండలం ఇలపర్రులో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇలపర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు, డీటీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ద్విచక్ర వాహనాన్ని తీసుకువస్తున్న యువకులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నుంచి భీమవరం వెళ్ళే పూలపల్లి బైపాస్ రోడ్డులో జరిగిన ఓ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తృటిలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న పూలపల్లి బైపాస్ రోడ్డులో భీమవరం వైపు ఓ ఇన్నోవా కారు వేగంగా దూసుకుపోయింది. అదే మార్గంలో భీమవరం వైపుగా వెళుతున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతడే మోటర్ సైకిల్‌తో సహా సుమారు 20 అడుగుల లోతులో ఉన్న సర్వీస్ రోడ్డులోకి జారిపడిపోయాడు. స్థానికులు హుటాహుటిన కిందకు వెళ్లి ఆ ద్విచక్రవాహనదారుడిని పైకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి ఎటువంటి గాయాలు కాలేదు. బైక్‌ను ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది.

నిరుపేదలకు నాణ్యమైన సేవలందించాలి



కొప్పర్రు గ్రామంలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నాణ్యమైన సేవలందించాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. బుధవారం ఆయన నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలోని 89వ నెంబరు రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ కాటా తూకాన్ని పరీక్షించారు. రేషన్ పంపిణీలో అవకతవకలు గానీ ఫిర్యాదులు గానీ తలెత్తకుండా ఉండే విధంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చౌకధరల దుకాణంలోని స్టాక్ రూమ్‌లో సరుకును, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అయితం సత్యానారాయణ, వీఆర్వో వినోద్ తదితరులు ఉన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ వేయించాలి



గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్‌ను వేస్తున్న కె.మురళీకృష్ణ

నరసాపురం రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. బుధవారం నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలంలోని కాళీపట్నంలో 800 జీవాలకు, పేరుపాలెం గ్రామంలో సారవ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కైల వీర్రాజుకు చెందిన సుమారు 1200 గొర్రెలు, మేకలకు నట్టల మందును వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ఏలికపాములు, బద్దె పురుగు, లివర్‌ఫ్లూక్ మొదలగు అంతర పరాన్న జీవుల వల్ల అనేక అనర్థాలు సంభవించడం వల్ల గొర్రెలు, మేకల పెంపకందారులు 30 శాతం ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. నట్టల నివారణకు గానూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందును గొర్రెలు, మేకలకు తాగించి రైతులు లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ వై.సుధాకర్, పశువైద్యులు సురేంద్రకుమార్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ప్రక్రియపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు

నరసాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు వ్యవస్థ ద్వారా 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఐడీలను రూపొందించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు వీక్షించారు. ఇప్పటికే 12 అంకెలు అపార్ గుర్తింపునకు 9,10 తరగతుల విద్యార్థుల వివరాలను పొందుపరుస్తుండగా ఈ విధానాన్ని అన్ని తరగతుల విద్యార్థులకూ కల్పించాలని సూచించారు. ఎంఈఓలు పిల్లి పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

14న మెగా పేరెంట్స్ మీటింగ్

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగు అనే నినాదంతో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 14న ప్రతి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి విద్యార్థుల ప్రగతిని వివరించి సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి మార్టేరు–కవిటం రోడ్డులో రాకపోకల నిలిపివేత

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు– కవిటం రోడ్డులో రాకపోకలను శుక్రవారం నుంచి నవంబరు 12 తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు పెనుమంట్ర ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ ఆలపాటి యశ్వంత్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నరసాపురం–అశ్వారావుపేట రోడ్డులో రహదారి విస్తరణ పనులలో భాగంగా మార్టేరు సెంటర్ నుంచి శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి గుడి వరకు 700 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని, అందువల్ల ఈ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధ్వానంగా ఉన్న ఈరోడ్డు విస్తరించి పటిష్ఠ పరిచేందుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు కృషితో రూ. 25 కోట్లు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఈ ఏడాది జనవరి 28న శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కవిటం వద్ద శంకుస్థాపన చేయగా, విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. అవే పనులను తిరిగి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నరసాపురం నుంచి తణుకు, రాజమండ్రి, ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తదితర వాహనాలు లంకలకోడేరు, కొమ్ముచిక్కాల, ఆలమూరు మీదుగా మార్టేరు పాతవంతెన సెంటర్‌కు మళ్లిస్తున్నట్లు తెలిపారు. చిన్నవాహనాలు కవిటం, కొమ్ముచిక్కాల మీదుగా ఆలమూరు చేరుకోవచ్చని, ఇతర వాహనాలు కవిటం నుంచి ఓఎన్‌జీసీ రోడ్డు గుండా మార్టేరు చేరుకోవచ్చని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని 216 జాతీయరహదారి లాకుల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. 22వవార్డు కొత్తకాలనీకి చెందిన బోడసింగు లక్ష్మీనారాయణ ఏటిగట్టు మీదుగా వీరభవానీ గుడి వద్ద నుంచి బైక్‌పై వెళుతుండగా, ఓ వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో లక్ష్మీనారాయణకు కాళ్లపై గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వాసుత్రికి తీసుకెళ్లారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు మోటార్‌సైకిల్ నంబర్ ఆధారంగా ప్రమాదం చేసింది ఎవరనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.